క్లుప్తంగా

సమయ పాలన తప్పక పాటించాలి


సచివాలయంలో వెంకటేశ్వరి

రొంపిచెర్ల: గ్రామ సచివాలయ ఉద్యోగులు తప్పక సమయపాలన పాటించాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరి అన్నారు. ఆమె మంగళవారం మోటుమల్లెల గ్రామ సచివాలయాన్ని, ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆరుగురు పిల్లలు ఉండడంతో హాజరు శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ మల్లీశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, ఈఓ ధనలక్ష్మి, కార్యదర్శి మునిరాజ పాల్గొన్నారు.

షిఫ్ట్ పద్ధతిలో విద్యుత్ సరఫరా ఇవ్వాలి

చౌడేపల్లె: వ్యవసాయానికి తొమ్మిది గంటలసేపు ఒకేసారి ఇవ్వకుండా షిఫ్ట్ పద్ధతుల్లో రెండు సార్లు విద్యుత్ సరఫరా ఇవ్వాలని రైతు ఉత్పత్తిదారుల సంఘ మండల అధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవికాలంలో ఒకేసారి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరా ఇవ్వడం వలన మోటార్లు దెబ్బతినడంతోపాటు బోర్లలో నీటి మట్టం అడుగంటిపోతోందని వాపోయారు. చాలా చోట్ల నీరు రాకపోగా మోటార్లు కాలిపోతున్నాయన్నారు. అధికారులు స్పందించి ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు షిఫ్ట్ పద్ధతుల్లో తొమ్మిది గంటల సేపు కరెంటు సరఫరా ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు.

ఇఫ్తార్‌కు రూ.1.60 లక్షల విరాళం


ఓదులపేటలో మత పెద్దలకు విరాళం అందజేస్తున్న నేతలు

చౌడేపల్లె: రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో ముస్లింల పట్ల పెద్దిరెడ్డి కుటుంబం తమ ఔదార్యాన్ని చాటుకుంది. మంగళవారం మండలంలోని 16 మసీదులకు మతపెద్దల సమక్షంలో ఇఫ్తార్ విందు నిర్వహణకు పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం తరపున పార్టీ నేతలు రూ.1.60 లక్షల విరాళాన్ని అందజేశారు. మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ సాధిక్ బాషా పాల్గొన్నారు.

నవోదయకు చింతమాకులపల్లె విద్యార్థి


నవ్యేష్

సదుం: మండలంలోని 79ఏ చింతమాకులపల్లెకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నవోదయకు ఎంపికైనట్లు హెచ్ఎం సుబ్రమణ్యం తెలిపారు. జాంధ్రపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినోద్ కుమార్ కుమారుడు నవ్యేష్ మంగళవారం విడుదలైన నవోదయ విద్యాలయ ప్రవేశ ఫలితాల్లో మెరిట్‌లో ఎంపికయ్యాడని ఆయన చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థిని ఎంఈఓలు సిద్ధరామయ్య, దామోదర, ఉపాధ్యాయులు అభినందించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆమేరకు విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వవిద్యార్థుల ద్వారా 46 యూనిట్ల రక్తాన్ని సేకరించి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధికి పంపినట్టు కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు తెలిపారు. ఇందులో స్థానిక వైద్యురాలు డా.లత, పాథాలజిస్టులు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు

31వ తేదీ లోపు చెల్లిస్తే 50 శాతం రాయితీ

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని పన్ను బకాయిదారులు ఈనెల 31వ తేదీలోపు పన్నులు చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ఆస్తిపన్నుపై 50 శాతం వడ్డీ మాఫీ లభించిందన్నారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అమ్మవారికి పోతురాజును బలి ఇస్తున్న దృశ్యం



ప్యాలెస్‌లో జమీందారు కుటుంబీకుల పూజలు



జాతర కోలాహలం

- అంగరంగ వైభవంగా ప్రారంభమైన సుగుటూరు గంగమ్మ జాతర
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

పుంగనూరు: జమీందారుల కులదైవమైన సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం రాత్రి తొలిరోజు కోలాహలంగా ప్రారంభమైంది. ముందుగా ప్యాలెస్‌లో అమ్మవారికి జమీందారులు సోమశేఖర్ చిక్కరాయల్, మల్లికార్జున రాయల్, వారి కుటుంబసభ్యులు తొలి పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సతీమణి స్వర్ణమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమీందారులను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా అమ్మవారిని పట్టణంలో ప్యాలెస్ వీధి, తేరువీధి, సెంటర్‌లాడ్జి, సుబేదారు వీధి, తూర్పుమొగశాల, కుమ్మరవీధి మీదుగా కట్టకిందపాళ్యెం నుంచి బుధవారం వేకువజామున అమ్మవారిని ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలోకి తీసుకొచ్చి ప్రజల దర్శనానికి అనుమతిస్తారు. ఈసందర్భంగా బెస్త, తోటి కులస్తులు అమ్మవారికి సారెలు సమర్పించి పూజలు చేస్తారు. అనంతరం జమీందారులు వారి సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయంలో తొలి పూజలు చేస్తారు. తరువాత అమ్మవారిని భక్తుల దర్శనార్థం అనుమతిస్తారు. రాత్రి వరకు భక్తులను దర్శనానికి అనుమతించి, రాత్రి 12 గంటలకు అమ్మవారిని నిమజ్జనం చేసి, విగ్రహాలను ప్యాలెస్‌లో భద్రపరచడం ఆనవాయితీ.

జాతర ప్రారంభం


విద్యుత్ వెలుగుల్లో జమిందారు ప్యాలెస్

సుగుటూరు గంగమ్మను అత్యంత సుందరంగా ఏర్పాటు చేసిన పల్లకీలో ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపులో వందలాది జంతు బలులు సమర్పించి, ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అమ్మవారికి నెయ్యి దీపాలు, పెరుగన్నం పెట్టి మొక్కులు చెల్లించారు.

అన్నదానం

పట్టణంలోని తాటిమాకులపాళెం వద్ద బలిజ సంఘం నాయకులు సుబ్రమణ్యం, రవి, సాగర్, తులసి, గోపి ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్నదానం చేశారు. అలాగే వర్తక వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెంకటాచలపతి ఆధ్వర్యంలో 5 వేల మందికి అన్నదానం చేశారు. కుమ్మరవీధి, బస్టాండ్, ఇందిరా సర్కిల్, కొత్తపేట, కొత్తయిండ్లలో అన్నదానం, మజ్జిగ, నీరు పంపిణీ చేశారు

భారీ బందోబస్తు

పట్టణంలో సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పర్యవేక్షణలో పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఐలు రామ్‌భూపాల్, ఉమామహేశ్వరరావు, మురళి, ప్రసాద్ కలిసి 400 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు నిర్వహించారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, పారిశుధ్య కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించారు.



గంగమ్మలకు పూజలు

సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా పట్టణంలోని గంగమ్మలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బస్టాండ్‌లో గల విరూపాక్షి మారెమ్మకు పూజలు చేశారు. అలాగే తూర్పుపాళెంలోని స్థల గంగమ్మ, పలమనేరు రోడ్డులోని మల్లారమ్మ, తూర్పుమొగశాలలో నల్ల గంగమ్మ, కట్టకిందపాళెంలోని పడమటి గంగమ్మ, చెరువుకట్టపై ఉన్న నీళ్లరాళ్ల గంగమ్మ, కోనేరు వద్ద గల బోయకొండ గంగమ్మ, బజారు వీధిలోని నడివీధి గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేసి జంతు బలులు సమర్పించారు.

పుంగనూరు ప్యాలెస్‌లో పూజలు చేస్తున్న జమీందారులు రాజసోమ శేఖర్ రాయల్, మల్లికార్జున రాయల్ కుటుంబీకులు


పుంగనూరు ప్యాలెస్‌లో గంగమ్మ తల్లికి నగలు వేస్తున్న పెద్దిరెడ్డి స్వర్ణమ్మ, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

వి.కోట: నూతన బోర్లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నాగనపల్లిలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. గ్రామస్తుల అభ్యర్థన మేరకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జెడ్పీ నిధులను మంజూరు చేయించి మంగళవారం బోరును వేయించారు. బోరుకు ఆయన చేతుల మీదుగా పూజ చేసి డ్రిల్లింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నేతలు అమరనాథ్ శేషప్ప, బాబు, త్యాగరాజు, వెంకటరావు,రమేష్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలి

బంగారుపాళెం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యనందించాలని బంగారుపాళెం ఐసీడీఎస్ సీడీపీఓ వాణిశ్రీదేవి అన్నారు. మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బంగారుపాళెం, తుంబకుప్పం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ–పడాయి బీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీడీపీఓ మాట్లాడుతూ, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను కచ్చితంగా నేర్పించాలన్నారు. ఆట ఆధారిత బోధన ద్వారా చిన్నారులు చెప్పే అంశాలను త్వరగా నేర్చుకుంటారన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను తప్పకుండా పిల్లలకు నేర్పించాలని చెప్పారు.


మాట్లాడుతున్న సీడీపీఓ వాణిశ్రీదేవి

50శాతం మినహాయింపు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తిపన్ను బకాయిలున్న వారు ఈనెల 31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీలో 50శాతం మినహాయింపు ఉంటుందని ఈ అవకాశాన్ని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల్లో బుధవారం విధులను బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రేయిల్ దారుణ హత్యకు గురయ్యారు. దీనిని ఖండిస్తూ హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరిస్తున్నట్లు ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని కోరారు.

న్యాయవాదుల సంఘ ఎన్నికలు రేపు

పుంగనూరు: పట్టణంలోని న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఈనెల 27న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సంఘానికి సంబంధించిన అన్ని పోస్టులు ఏకగ్రీవమయ్యాయి. కానీ అధ్యక్ష ఎన్నికకు మాత్రం ప్రస్తుత అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు, ఎల్‌వీ.రమణ పోటీ పడుతున్నారు. ఎవరిని విజయం వరిస్తుందోనని న్యాయవాదుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇరువురు తమ వర్గాలను కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

తండ్రీకూతురికి తీవ్ర గాయాలు

శాంతిపురం: పలమనేరు జాతీయ రహదారిపై శాంతిపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నడింపల్లికి చెందిన తిమ్మోజి(43), ఆయన కుమార్తె నందిని(14) మంగళవారం మీసేవా కేంద్రంలో పని నిమిత్తం శాంతిపురానికి వచ్చారు. అనంతరం స్వగ్రామానికి బైక్‌లో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన వ్యాను ఢీకొట్టింది. దీంతో తిమ్మోజి తలకు, నందిని కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిమ్మోజిని కుటుంబసభ్యులు బెంగళూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఆరోగ్యంతో కూడిన విద్యను అందిద్దాం


శిక్షణ ఇస్తున్న అధికారులు

వి.కోట: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లలకు ఆరోగ్యకరమైన పోషణ విలువలుగల ఆహారంతోపాటు మంచి విద్య అందించే ప్రయత్నం చేద్దామని బైరెడ్డిపల్లి ప్రాజెక్ట్ ఆఫీసర్ అరుణశ్రీ సూచించారు. మంగళవారం మండలంలోని ఖాజీపేట ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషన్ బీ..పడాయి బీ అనే కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషన్ బీ.. పడాయి బీ కార్యక్రమంలో భాగంగా మంచి పోషణ, ఆరోగ్యంతో కూడిన విద్యపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యవేక్షకులు రమాదేవి, సుజాత, మాధవి, రాధ పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

కుప్పంరూరల్: స్వామి ప్రబోధానంద సేవా సమితి వారి ఉగాది క్యాలెండర్‌ను మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. స్వామి ప్రబోధానంద ప్రారంభించిన ఈ క్యాలెండర్ ఎంతో ప్రత్యేకమైందని సేవాసంస్థ ప్రతినిధి కృష్ణ అన్నారు. క్యాలెండర్‌లో ఎంతో జ్ఞానం పొందుపరచినట్లు చెప్పారు. తెలుగు పండుగలు, పర్వదినాలు, తిథుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, శరవణ, సుధాకర్, చందు, నాగరాజు, దేవరాజు, శివకృష్ణ, కృష్ణారెడ్డి, రాజ్‌కుమార్, వెంకటలక్ష్మీ ఉన్నారు.

కొండెక్కిన నాడు–నేడు పనులు!

- ఆగిన సెకెండ్ ఫేజ్ స్పెల్–1, స్పెల్–2
- కొత్త ఎస్ఎంసీలొచ్చినా మొదలు కాని పనులు
- సర్కారు బడులపై నిర్లక్ష్యం చూపుతున్న కూటమి ప్రభుత్వం

పలమనేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. మనబడి నాడు–నేడు పథకం అమలు, ఇంగ్లిష్ మీడియం బోధనతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. ప్రభుత్వ స్కూళ్లపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచింది. ఫలితంగా అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి. అంతేకాకుండా కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా విద్యాబోధనతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 'అడ్మిషన్లు ఫుల్..సిఫార్సులు తేకండి' అని స్కూళ్ల వద్ద టీచర్లు ఫ్లెక్సీలు పెట్టే స్థితికి తెచ్చిందంటే ఏ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లకు ఆదరణ పెరిగిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో పలు పాఠశాలల్లో పిల్లలకు అదనపు తరగతి గదుల్లేక చెట్లకిందే చదువులు సాగుతున్నాయి.

ఇదీ పరిస్థితి

పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె హైస్కూల్‌లో సెకండ్ ఫేజ్ స్పెల్–1, 2లలో నాలుగు తరగతి గదులు రూ.84లక్షలతో మంజూరయ్యాయి. ఇప్పటివరకు రూ.38లక్షలు వచ్చింది. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ నిధుల నుంచి అందాల్సిన సామగ్రి పెండింగ్‌లో ఉంది. ఫలితంగా గదుల నిర్మాణం ఆగింది. కొన్ని గదులు పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో వెయ్యి మంది వరకు చదువుతున్నారు. వీరికి ఫేజ్–2 సెకండ్ స్పెల్‌లో 15 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. వీటిల్లో 15 గదులకు మాత్రమే రూ.1.16 కోట్లు మంజూరైంది. అయితే రూ.80 లక్షల బిల్లులు రాక పనులు ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ దశల్లో నిలిచిపోయాయి. వి.కోట ఉర్దూ ఉన్నత పాఠశాల పనులు స్తంభించాయి. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని ఫేజ్–2లో ఎంపికైన బడుల్లో కనిపిస్తోంది.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలొచ్చినా

గత ప్రభుత్వంలో నాడు–నేడు పనులు అప్పటి పాఠశాల నిర్వహణ కమిటీలతో చేయించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులకు స్వస్తి పలికింది. అప్పటి వరకూ పనులు చేస్తున్న కమిటీలను వైఎస్సార్‌సీపీ నేతలు ఎంపిక చేశారని కూటమి ప్రభుత్వం భావించింది. దీంతో కూటమి ప్రభుత్వం గత ఆగస్టులో కొత్తగా పాఠశాల కమిటీ ఎన్నికలు నిర్వహించింది. కొత్త కమిటీలతో అయినా నాడు–నేడు పనులను ప్రభుత్వం చేయిస్తుందని ఉపాధ్యాయులు భావించారు. తల్లిదండ్రుల సమావేశాలను సైతం ఆయా బడుల్లో గతంలో నిర్వహించారు. కానీ ఇప్పటి వరకూ నాడు–నేడు పనులు మొదలు కాక ప్రభుత్వ బడుల్లోని మొండి గోడలు వెక్కిరిస్తున్నాయి.


పలమనేరు బాలికోన్నత పాఠశాలలో ఆగిన నాడు–నేడు పనులు


బాలికోన్నత పాఠశాలలో చెట్లకిందే చదువులు(ఫైల్)

నియోజకవర్గంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు: (ప్రైమరీ,యూపీ, హైస్కూళ్లు)	469
ఫస్ట్ ఫేజ్ నాడు–నేడులో ఎంపికైన బడులు మొత్తం	123
దీనికోసం గత ప్రభుత్వం పెట్టిన ఖర్చు	32.87 కోట్లు
సెకండ్ ఫేజ్‌లో ఎంపికైన పాఠశాలలు మొత్తం	230
దీనికోసం ఖర్చుచేయనున్న మొత్తం	రూ. 62 కోట్లు
ఇప్పటి వరకూ పెండింగ్‌లోని మొత్తం	రూ. 38 కోట్లు
పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	48,200


కొలమాసనపల్లెలో ఆగిన పనులు

కొన్ని బడుల్లో పనులు ఆగాయి



మండలంలో నాడు–నేడు ఫేజ్–2లో రెండు స్పెల్స్‌లో రూ.44.92కోట్ల నిధులతో 41 స్కూళ్లు ఎంపికయ్యాయి. రూ.35కోట్లు అందాయి. ఆపై కొన్ని బడులకు బిల్లులు సైతం అందడంతో పనులు జరిగాయి. మరి కొన్ని బడులకు బిల్లులందక పనులు వివిధ దశల్లోనే నిలిచిపోయాయి. ఇవి పూర్తి కావాలంటే రూ.9 కోట్లు వరకూ నిధులు రావాలి. అప్పుడు పూర్తిస్థాయిలో పనులు పూర్తవుతాయి.

–లీలారాణి, ఎంఈఓ, పలమనేరు